సాక్షి గుంటూరు

గురువారం ၊ 21 ၊ డిసెంబర్ ၊ 2023



యార్డుకు 58,077 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 58,077 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి 56,806 బస్తాల అమ్మకాలు జరిగాయి.



గ్రూప్‌-1, 2 లకు ఉచిత శిక్షణ

గుంటూరు వెస్ట్ : గ్రూప్‌-1, 2 పరీక్షలకు బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత శిక్షణ అంది స్తామని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి బుధవారం తెలిపారు.

కాలభైరవస్వామికి పూజలు



అమరావతి: అమరేశ్వ రాలయంలో కాలభైర వాష్టమి సందర్భంగా బుధవారం దేవాల యంలోని కాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. భక్తులు పెద్ద సంఖ్యలో కాలభైరవ స్వామిని దర్శించుకున్నారు.

జనజ్జేత.. జైత్రయాత్ర

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జైత్రయాత్ర అప్రతిహతంగా సాగుతోంది. నాలుగున్నరేళ్ల పాలనలో సుదీర్ఘ కాలంగా పరిష్కారం కాని ఎన్నో సమస్యలకు శుభం కార్డు పడింది. దశాబ్దాల కలలు సాకారమయ్యాయి. జనజీ వితాల్లో వెలుగు రేఖలు విచ్చుకున్నాయి. గడపగడపన సంక్షేమ లక్ష్మి ఆనంద తాండవం చేసింది. ముంగిళ్లలో ప్రగతి రంగవల్లులు ఆవిష్కృతమయ్యాయి. రెండేళ్ల కరోనా సంక్షోభం వెంటాడినా.. అభివృద్ధిలో వెనుకంజ వేయలేదు. సంక్షేమ పథకాల పరంపర దిగ్విజయంగా సాగింది. విద్యా, వైద్య, సేద్య రంగాలు కనీవినీ ఎరుగని రీతిలో విప్లవాత్మక మార్పులతో పురోగమనంలో పరవళ్లు తొక్కాయి. ఫలితంగా ప్రతి ఊరూ..వాడా జయహో జగన్ అంటూ నినదిస్తోంది. గురువారం సంక్షేమ రేడు, నవ్యాంధ్ర నవరత్నాల సారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఉమ్మడి గుంటూరు జిల్లా విజయ ప్రస్థానంపై ప్రత్యేక కథనం..

- సంక్షేమం, ప్రగతి జోడుగుర్రాల సవారీ
- అభివృద్ధి పథంలో ఉమ్మడి గుంటూరు
- పిడుగురాళ్ల, బాపట్లలో మెడికల్ కళాశాలలు
- నిజాంపట్నం, ఓడరేవుల్లో ఫిషింగ్ హార్బర్లు
- కొత్తగా ఆక్వా యూనివర్సిటీ మంజూరు
- గుంటూరు చానల్ విస్తరణ
- వరికపూడిశెల ఎత్తిపోతలకు శంకుస్థాపన
- రూ.వందల కోట్లతో నాడు-నేడు



సాక్షి ప్రతినిధి, గుంటూరు: వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టాక ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థలతో ప్రజల గడప చెంతకే సంక్షేమ పథకాల లబ్ధి, వందల రకాల సేవలు అందుతున్నాయి. పింఛన్, రేషన్ కూడా ముంగిళ్లలోకే వచ్చి ఒడిలో వాలుతున్నాయి. సంక్షేమ నవరత్నాల ద్వారా ఇప్పటివరకు ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 91 లక్షల మందికి రూ.30 వేల కోట్ల లబ్ధి చేకూరడం విశేషం. ఇన్ని లక్షల మందికి ఇంత మేలు చేసిన ప్రభుత్వం దేశచరిత్రలోనే మరొకటి లేదంటే అతిశయోక్తి కాదు. మనబడి నాడు-నేడు కార్యక్రమం ద్వారా ఉమ్మడి జిల్లాలోని 1,183 పాఠశాలలను 289 కోట్ల రూపాయలతో ఆధునికీకరించారు. రూ.49.24 కోట్లతో ఎనిమిది కొత్త పీహెచ్‌సీ భవనాల నిర్మాణం, 77 పీహెచ్‌సీల భవనాల ఆధునికీకరణ చేపట్టారు. పరిపాలనా సౌలభ్యం కోసం ఉమ్మడి జిల్లాను గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలుగా విభజించారు. గుంటూరు నగరాన్ని రూ.300 కోట్ల విలువైన పనులతో అభివృద్ధి చేశారు.

ప్రోగ్రెస్ రి'పోర్టు'

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, నాబార్డు సహకారంతో నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్‌ను రూ.450 కోట్లతో ఆధునికీకరిస్తున్నారు. చీరాల మండలం ఓడరేవులోనూ రూ.450 కోట్లతో ఫిషింగ్ హార్బర్, నిజాంపట్నంలో 180 కోట్లతో ఆక్వా యూనివర్సిటీ నిర్మాణాలకు ఇటీవలే ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.

అందరికీ ఇళ్లు

పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా ఉమ్మడి జిల్లాలో 6,660 ఎకరాల భూమిని సేకరించి రూ.1,240 కోట్ల ఖర్చుతో జగనన్న కాలనీలను అభివృద్ధి చేసి మూడు లక్షల మందికి స్థలాలు కేటాయించారు. తాజాగా శాసన రాజధాని అమరావతి ప్రాంతంలో మరో 50,793 మందికి ఇళ్లస్థల పట్టాలు ఇచ్చారు.

వరికపూడిశెల వరప్రదాయిని

నాగార్జునసాగర్ రిజర్వాయర్ ఎగువన వరికపూడిశెల వాగుపై రూ.340 కోట్లతో ఎత్తిపోతల పథకం పనులకు గతనెలలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ ఎత్తిపోతల పూర్తయితే పల్నాడు, ప్రకాశం జిల్లాల్లోని 73 వేల ఎకరాల ఆయకట్టుకు నీటి ఎద్దడి లేకుండా చూడవచ్చు. బొల్లాపల్లి మండలంలో 25 వేల ఎకరాలకుపైగా సాగునీరు అందించడంతోపాటు వినుకొండ నియోజకవర్గంలో తాగునీటి సమస్యను పరిష్కరించవచ్చు. ఇదిలా ఉంటే నూజెండ్ల మండలంలో 10 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు రూ.95 కోట్లతో ఐదు ఎత్తిపోతల పథకాల నిర్మాణానికి ప్రభుత్వం సర్వే పూర్తిచేసింది. కంభంపాడు, కొత్తపాలెం, పువ్వాడ, ములకలూరు, ఉప్పలపాడు వద్ద ఎత్తిపోతల నిర్మాణాలు కానున్నాయి.

ప్రభుత్వ ప్రాధాన్య భవనాల నిర్మాణం

జిల్లాలో ప్రభుత్వ ప్రాధాన్య భవనాల నిర్మాణం శరవేగంగా సాగుతోంది. ఇప్పటికే పంచాయతీ రాజ్ శాఖ ద్వారా 311 సచివాలయ భవనాలు, 138 రైతు భరోసా కేంద్రాలు, 346 స్కూల్ ప్రహరీల పనులు, 96 వైఎస్సార్ క్లినిక్‌లను రూ. 627 కోట్లతో పూర్తి చేశారు. 139 బల్క్‌మిల్క్ యూనిట్లు, 165 వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీ భవనాల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయి.

గుంటూరు చానల్ విస్తరణకు ఆమోద ముద్ర

గుంటూరు చానల్ విస్తరణకు ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. దీనివల్ల గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 48 వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు ఉపయోగం ఉంటుంది. అలాగే మల్లాయపాలెం, కాకుమాను మేజర్ల కింద ఉన్న 9,600 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ సాధ్యమవుతుంది. విస్తరణ పనుల కోసం 274.53 కోట్లతో పరిపాలనా అనుమతులు వచ్చాయి. ఈ పనులను మెగా ఇంజినీరింగ్ సంస్థకు అప్పగించారు. భూసేకరణ కోసం 113.39 కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. గుంటూరు జిల్లాలో 389.78 ఎకరాలు, బాపట్ల జిల్లాలో 51.38 ఎకరాలు కలిపి మొత్తం 441.16 ఎకరాలు సేకరించాల్సి ఉంది. దీని కోసం ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. భూసేకరణ ప్రక్రియ కూడా ఒక కొలిక్కి రానుంది.

వైద్య కళాశాలలకు మహర్దశ

వైద్య రంగానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. గుంటూరు వైద్య కళాశాల అభివృద్ధిపై దృష్టి సారించారు. నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా రూ. 500 కోట్లు మంజూరు చేశారు. ఇటీవల కాలంలో 40 పీజీ సీట్లు మంజూరు చేశారు. వైద్య వసతుల కోసం రూ.40.8 కోట్లు విడుదల చేశారు.

- పిడుగురాళ్ల మండలం కామేపల్లి శివారులో 47.54 ఎకరాల విస్తీర్ణంలో రూ.500 కోట్లతో మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు చేపట్టారు. ఈ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ కాలేజీ పూర్తయితే వంద ఎంబీబీఎస్ సీట్లు వచ్చే అవకాశం ఉంది. మారుమూల గ్రామాలకూ అత్యాధునిక వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ కళాశాల కోసం కేంద్ర ప్రభుత్వం రూ.195 కోట్లను తన వాటాగా విడుదల చేసింది.
- బాపట్లలో రూ.505 కోట్ల ఖర్చుతో వైద్య కళాశాలను నిర్మించనున్నారు. దీనికి సంబంధించి గత ఏడాది ఏప్రిల్ 27న ప్రభుత్వం పరిపాలనా అనుమతులు జారీ చేసింది. దీని కోసం 51.07 ఎకరాల్లో జమ్ములపటం, మూలపాలెం సరిహద్దుల్లో భూమిని సేకరించారు. సాయిల్ టెస్టులూ పూర్తయ్యాయి. త్వరలోనే పనులు ప్రారంభించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.

అజేయ సారథికి అత్యున్నత అవార్డు

మనో'నేత్రం'తో మహోన్నత శిఖరానికి

- అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్‌ను వరించిన అర్జున అవార్డు
- జనవరి 9న రాష్ట్రపతి చేతులమీదుగా ప్రదానం
- పల్నాడు జిల్లా మాచర్ల స్వస్థలం



ప్రధాన మంత్రి మోదీతో క్రికెటర్ అజయ్‌కుమార్‌రెడ్డి (ఫైల్)

తెనాలి, మాచర్ల: ప్రతిష్టాత్మక జాతీయ క్రీడా పురస్కారం అర్జున అవార్డు ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన భారత అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్ ఇల్లూరి అజయ్‌కుమార్‌రెడ్డిని వరించింది. యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ బుధవారం జాతీయ క్రీడా అవార్డులను ప్రకటించింది. జనవరి 9న రాష్ట్రపతి భవన్‌లో జరిగే ప్రత్యేక వేడుకలో రాష్ట్రపతి చేతులమీదుగా ఈ పురస్కారాన్ని బహూకరిస్తారు. ఈ గౌరవంతో అజయ్‌కుమార్‌రెడ్డి భారతదేశంలో అర్జున అవార్డుకు ఎంపికైన తొలి అంధ క్రికెటర్‌గా గుర్తింపు పొందారు. 2010 నుంచి భారత అంధుల క్రికెట్ జట్టు క్రికెటర్‌గా ఆడుతూ అనేక విజయాలను సాధించారు. తన సారథ్యంలో భారత అంధుల జట్టును పలుమార్లు విశ్వవిజేతగా నిలిపారు. 2012లో వైస్‌కెప్టెన్‌గా భారత జట్టు టీ20 వరల్డ్ కప్, 2014లో వన్డే వరల్డ్ కప్‌ను సాధించారు. జట్టు కెప్టెన్‌గా 2017 టీ20 వరల్డ్‌కప్, 2018 వన్డే వరల్డ్ కప్‌ను సాధించి, విజయపరంపరను కొనసాగించారు. తన సారథ్యంలోనే 2016లో ఆసియా కప్ సాధించగా, గత ఆగస్టులో ఐబీఎస్ఏ వరల్డ్ గేమ్స్ పోటీల్లో జట్టు రజత పతకం సాధించింది. వివిధ దేశాలతో జరిగిన సిరీస్‌ల్లోనూ అద్భుత ఫలితాలను సాధించారు. ప్రస్తుతం అర్జున అవార్డుకు ఎంపిక కావటం తన జీవితంలో మధుర క్షణంగా 'సాక్షి'తో ఫోన్‌లో చెప్పారు.

స్వస్థలం మాచర్ల..

భారత అంధుల క్రికెట్ జట్టును ప్రపంచ విజేతగా నడిపిస్తున్న అజయ్‌కుమార్‌రెడ్డి స్వస్థలం ప్రస్తుత పల్నాడు జిల్లా మాచర్ల. తల్లిదండ్రులు వెంకటరమణ, శ్రీనివాసరెడ్డి. అన్నయ్య ఆంజనేయరెడ్డి పోలీస్ అధికారి. 2011లో డిగ్రీ పూర్తిచేసిన అజయ్‌కుమార్‌రెడ్డికి క్రీడాకోటాలో స్టేట్‌బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్‌లో ఉద్యోగం లభించింది. పదోన్నతిపై అసిస్టెంట్ మేనేజర్ హోదా దక్కింది. భార్య ప్రియ. వీరికో కుమార్తె. ప్రస్తుతం ఆయన బెంగళూరులో స్టేట్‌బ్యాంక్ రీజినల్ ఆఫీస్‌లో పనిచేస్తున్నారు. అజయ్ పుట్టుకతో అంధుడు కాదు. నాలుగేళ్ల వయసులో తలుపు గడియ తగిలి ఎడమ కంటి చూపు పోయింది. అప్పటివరకు సాధారణ స్కూల్‌లో చదువుకున్నారు. ఆరో తరగతిలో టీచరు బోర్డుపై రాసే అక్షరాలు కనిపించలేదు. కంటి డాక్టరుకు చూపిస్తే, ఇన్ఫెక్షన్‌తో కుడి కన్ను చూపు దెబ్బతిందని చెప్పారు. ఆయన సలహాపైనే 2002లో నరసరావుపేటలోని అంధుల పాఠశాలలో చేర్చారు. అక్కడే క్రికెట్‌పై ఆసక్తి కలిగింది. 2010 వరకు చదువుకుంటూనే ఎన్నో క్రికెట్ మ్యాచ్‌లు ఆడి బహుమతులు గెలుచుకున్నారు. ప్రస్తుతం కేంద్రం అర్జున అవార్డు ప్రకటించిన నేపథ్యంలో మాచర్ల సోమిరెడ్డి బజారులో వారి బంధువులు సంబరాలు జరుపుకొన్నారు.

ఉమ్మడి జిల్లా నుంచి ఆరో క్రీడాకారుడు..

ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి అర్జున అవార్డును గెలిచినవారిలో అజయ్‌కుమార్‌రెడ్డి ఆరో క్రీడాకారుడు. గతంలో మొవ్వా శ్యాంసుందరరావు, ఆరికపూడి రమణారావు ఇద్దరూ వాలీబాల్ క్రీడలో అర్జున, ద్రోణాచార్య అవార్డులు రెండింటినీ పొందారు. బ్యాడ్మింటన్‌లో కిడాంబి శ్రీకాంత్, చదరంగంలో పెండ్యాల హరికృష్ణ, ద్రోణవల్లి హారికలు 'అర్జున' గౌరవాన్ని స్వీకరించారు.

అంధుల క్రికెట్ విజయ సారథి...



అంధుల క్రికెట్ విజయ సారథి అజయ్‌కుమార్ రెడ్డి. 2017 టీ20 వరల్డ్ కప్ మ్యాచ్‌ల్లో ఏపీ, తెలంగాణలో జరిగిన రెండు మ్యాచ్‌లను మేమే స్పాన్సర్ చేశాం. అప్పుడే ఆయనలోని ప్రతిభను, దేశభక్తిని గమనించాను. దేశం కోసం ఆడేందుకు ఎంతైనా కష్టపడటం ఆయన నైజం. భారత ప్రభుత్వం అర్జున అవార్డుకు ఎంపిక చేయటం సముచితం.

– జహరాబేగం, చైర్‌పర్సన్, క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్, ఆంధ్రప్రదేశ్

పేద విద్యార్థుల భవితకు పటిష్ట పునాదులు

కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి



జగనన్న విదేశీ విద్యా దీవెన చెక్కును విద్యార్థులకు అందజేస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, మేయర్ కావటి మనోహర్, ఎమ్మెల్యే ముస్తఫా, జేసీ రాజకుమారి

గుంటూరు వెస్ట్: పేద విద్యార్థుల విదేశీ విద్యతోపాటు సివిల్ సర్వీసెస్ సాధనకు కావాల్సిన ఆర్థిక చేయూతను రాష్ట్ర ప్రభుత్వం అందించడం అభినందనీయమని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న విదేశీ విద్య దీవెన, జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహక పథకాలకు సంబంధించిన నగదును బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేశారు. కార్యక్రమంలో కలెక్టరేట్ నుంచి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, తూర్పు నియోజకవర్గ శాసన సభ్యుడు మొహమ్మద్ ముస్తఫా, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు (డైమండ్ బాబు), కుమ్మరి, శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం, కృష్ణ బలిజ, పూసల కార్పొరేషన్ చైర్‌పర్సన్ కోలా భవాని, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ నాయకురాలు నూరి ఫాతిమ వర్చువల్ విధానంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ధనిక వర్గాలకే సాధ్యమయ్యే విదేశీ విద్య నేడు పేదవారికి కూడా అందుబాటులోకి తెచ్చిన ఘనత ముఖ్యమంత్రిదన్నారు. జిల్లాలో జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం ద్వారా 38 మందికి రూ.3.67 కోట్లు, జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం ద్వారా నలుగురికి రూ. 4 లక్షలు అందాయన్నారు. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న ఈ సాయంతో పేదలకు, దేశానికి సేవచేయాలని కలెక్టర్ కోరారు. అనంతరం లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేశారు.

నా కుమారునికి రూ.లక్ష అందజేశారు



నా కుమారుడు రాజేష్ సివిల్స్ ప్రిలిమ్స్ పాసయ్యాడు. ఢిల్లీలో మెయిన్స్‌కు శిక్షణ పొందుతున్నాడు. ప్రభుత్వం రూ.లక్ష అందజేసింది. ఈ మొత్తం నా కుమారుని మెయిన్స్‌కు ఉపయోగపడుతుంది. సివిల్స్‌లాంటివి చదవాలంటే మాలాంటి వారికి సాధ్యపడదు. ప్రభుత్వం అందిస్తున్న సాయానికి ధన్యవాదాలు.

– కె.బాలకృష్ణ, గుంటూరు

పోటీ పరీక్షలకు చేయూత గొప్ప విషయం



డిగ్రీ అవ్వగానే పోటీ పరీక్షలకు ఇంట్లో డబ్బులు అడగడం అంటే యువతకు కొంత ఇబ్బందిగా ఉంటుంది. సివిల్స్‌లాంటి కష్టతర పరీక్షల్లో ఉత్తీర్ణత అంటే అంత సులభం కాదు. ఆర్థిక సవాళ్లను ఎదుర్కోవాలి. ప్రభుత్వం అందిస్తున్న ఈ ప్రోత్సాహంతో నేను సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నా.

– జి.విద్యాసాగర్, ముట్లూరు

పండుగలా ఆడుదాం-ఆంధ్రా

- కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి
- 5 క్రీడా విభాగాలు, 232 మైదానాల్లో
- ఇప్పటి వరకు 1.25 లక్షల రిజిస్ట్రేషన్లు

గుంటూరు వెస్ట్: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ఆడుదాం-ఆంధ్రా క్రీడా పోటీలకు సంబంధించి నిర్వహించిన వీడియో సమావేశానికి స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, తూర్పు నియోజకవర్గ శాసన సభ్యుడు మొహమ్మద్ ముస్తఫా, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు (డైమండ్ బాబు), కుమ్మరి, శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం, కృష్ణ బలిజ, పూసల కార్పొరేషన్ చైర్‌పర్సన్ కోలా భవాని, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ నాయకురాలు నూరి ఫాతిమ విజ్యువల్ విధానంలో పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ క్రికెట్, వాలీబాల్, ఖో-ఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్ మొత్తం 5 విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 26 నుంచి ఫిబ్రవరి 10 వరకు మొత్తం 47 రోజులు నిర్విరామంగా జిల్లాలో పోటీలు జరుగుతాయన్నారు. 567 గ్రామ, వార్డు సచివాలయ పరిధిలోని 232 క్రీడా మైదానాలు ఇప్పటి వరకు గుర్తించామన్నారు. ఇప్పటి వరకు 1.25 లక్షల రిజిస్ట్రేషన్లు వచ్చాయని మరిన్ని వస్తాయన్నారు. పోటీల్లో పాల్గొనే వారికి 22,453 క్రీడా పరికరాలు ఇప్పటికే అందజేస్తామన్నారు. గ్రామస్థాయి నుంచి జరగనున్న ఈ పోటీలు చివరికి రాష్ట్ర పోటీలతో ముగుస్తాయని చెప్పారు. ప్రజాప్రతినిధులు పూర్తి సహకారమందించాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు, డీఎస్ఏ చీఫ్ కోచ్ జి.వెంకటేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఉచితశిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఆధ్వర్యంలో జీడీ, సీఆర్‌పీఎఫ్ తదితర విభాగాల్లో కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి అవసరమైన శిక్షణను రామ్‌కీ ఫౌండేషన్, రీ-సస్టైనబుల్టీ లిమిటెడ్, గ్రీన్‌స్పేస్ హౌసింగ్ అండ్ ఇంజినీర్స్ ప్రైవేట్ లిమిటెడ్, పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా అందిస్తున్నట్లు రామ్‌కీ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎంపీ రామిరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం హైదరాబాదులో 250 మంది, గుంటూరులో 250 మంది శిక్షణ పొందుతున్నారని తెలిపారు. సాయుధ బలగాల నియామకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం 26 వేలకుపైగా కానిస్టేబుళ్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో టెన్త్ ఉత్తీర్ణులైన 18 నుంచి 23 ఏళ్ల లోపు గల ఓసీ అభ్యర్థులు, 26 ఏళ్లలోపు ఓబీసీ, 28 ఏళ్లలోపు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు శిక్షణ పొందేందుకు అర్హులని వివరించారు. మొదటి విడత అర్హత పరీక్షకు హాజరు కాలేకపోయిన ఆంధ్రప్రదేశ్ అభ్యర్థుల సౌకర్యార్థం ఈ నెల 23న తుళ్లూరు మండలం పెదపరిమిలోని రామ్‌కీ ఫౌండేషన్ నైపుణ్య శిక్షణ కేంద్రంలో మరోసారి అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హత పరీక్షా ఫలితాలను ఈనెల 24న, ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఈనెల 25న విడుదల చేస్తామని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు ఈనెల 26వ తేదీ నుంచి శిక్షణకు హాజరు కావాల్సి ఉంటుందని, శిక్షణతోపాటు వసతి, భోజనం, స్టడీ మెటీరియల్ ఉచితంగా ఇస్తామన్నారు. వివరాలకు 7337585959, 9000797789 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేద్దాం

- గుంటూరు పశ్చిమ నియోజకవర్గాన్ని జగనన్నకు కానుకగా ఇద్దాం
- ఆత్మీయ సమావేశంలో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



ఆత్మీయ సమావేశంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త విడదల రజినిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, మేయర్ కావటి మనోహర్‌నాయుడు తదితరులు

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): గుంటూరు పశ్చిమ నియోజకవర్గాన్ని టీడీపీ కంచుకోటగా భావిస్తున్న నేపథ్యంలో ఆ కంచుకోటను బద్దలు కొట్టి వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేద్దామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త విడదల రజిని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఆత్మీయ సమావేశం పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరి నేతృత్వంలో నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వై నాట్ 175 అనే నినాదంతో ఎన్నికల వ్యూహంలో భాగంగా తనను పశ్చిమ నియోజకవర్గానికి సమన్వయకర్తగా నియమించారని, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలకనుగుణంగా పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రతి ఒక్కరి సహకారంతో, సలహాలు, సూచనలు తీసుకుంటూ పశ్చిమలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

2014 ఎన్నికల నుంచి గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో కొద్ది ఓట్ల మెజార్టీతో వైఎస్సార్ సీపీ ఓడిపోవడం వల్ల టీడీపీ పశ్చిమ నియోజకవర్గాన్ని తమ కంచుకోటగా భావిస్తోందని, దానిని పార్టీ పెద్దలు, నాయకులు, కార్యకర్తలందరి సహకారంతో బద్దలుకొట్టి వచ్చే ఎన్నికల్లో టీడీపీకి తగిన బుద్ధి చెప్పి పశ్చిమలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కానుక ఇద్దామని పేర్కొన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే మద్దాళి గిరికి పార్టీలో మంచి భవిష్యత్ ఉంటుందని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నమ్ముకున్న ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తారనే భరోసా ఉందన్నారు.

రజినిని భారీ మెజార్టీతో గెలిపించుకుందాం

శాసన మండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ విడదల రజినిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని చెప్పారు. ఎమ్మెల్యే నేతృత్వంలోనే వచ్చే ఎన్నికలు జరుగుతాయన్నారు. ఎమ్మెల్యే సీటు త్యాగం చేసిన మద్దాళి గిరికి సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తగిన ప్రాధాన్యం ఇస్తారన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యం

పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా అందరం కలిసికట్టుగా పనిచేయాలని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఇంత కాలం తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అంత కన్నా రెట్టింపు సహకారం విడదల రజినికి ఇచ్చి పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు.

- నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ బీసీ మహిళ విడదల రజినిని నియోజకవర్గంలో గెలుపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.
- మాజీ డెప్యూటీ మేయర్ తాడిశెట్టి మురళి మాట్లాడుతూ ప్రతిపక్షాలకు దిమ్మ తిరిగేలా గుంటూరు పశ్చిమలో వైఎస్సార్ సీపీ గెలుపు ఉండాలని పేర్కొన్నారు.
- తాను పుట్టి పెరిగింది, వ్యాపారం చేసింది కూడా గుంటూరులోనే అని, గుంటూరుతో మాకు ఎనలేని అనుబంధం ఉందని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రజినీకి గుంటూరు పశ్చిమ సీటు కేటాయించడం ఎంతో ఆనందంగా ఉందని రజిని భర్త కుమారస్వామి తెలిపారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాల్‌పురం రాము), డెప్యూటీ మేయర్లు వనమా బాలవజ్రబాబు (డైమండ్‌బాబు), షేక్ సజిల, దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముంతాజ్ పఠాన్, వైఎస్సార్ సీపీ డాక్టర్స్ విభాగం జిల్లా అధ్యక్షులు డాక్టర్ వై.షేక్, వైఎస్సార్ సీపీ నేతలు గనిక ఝూన్సీ, చంద్రగిరి ధీరజ్, వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు, జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జిలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నేడు 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్స్ పంపిణీ



గుంటూరులోని స్టాక్ పాయింట్ నుంచి ట్యాబ్‌లను పాఠశాలలకు పంపుతున్న దృశ్యం

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 8వ చదువుతున్న విద్యార్థులకు బుధవారం రెండో విడతలో ఆండ్రాయిడ్ ట్యాబ్‌లను ఉచితంగా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రపంచస్థాయి ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యమైన విద్యను అందించేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన విద్యా సంస్కరణల్లో భాగంగా ఖరీదైన బ్రాండెడ్ ట్యాబ్‌లను గతేడాది పంపిణీ చేసిన విద్యాశాఖ-సమగ్రశిక్ష ప్రస్తుతం వరుసగా రెండో విడతలో పంపిణీకి చర్యలు చేపట్టాయి. గురువారం సీఎం జగన్‌మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా విద్యార్థుల చేతుల్లో ఆధునిక ట్యాబ్‌లు ఉంచేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు పూర్తి చేశారు. గుంటూరు జిల్లాలోని 17 మండలాలతో పాటు గుంటూరు నగర పరిధిలోని 181 ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 12,481 మంది విద్యార్థులకు అత్యాధునిక ఫీచర్లతో కూడిన ట్యాబ్‌లను పంపిణీ చేయనున్నారు. బుధవారం గుంటూరు నగరంపాలెంలోని స్టాల్ బాలికోన్నత పాఠశాల స్టాక్ పాయింట్ నుంచి ట్యాబ్‌లను ఏపీసీ సమగ్రశిక్ష ఏపీసీ జి. విజయలక్ష్మి, గుంటూరు ఎంఈవోలు నాగేంద్రమ్మ, జ్యోతికిరణ్, వెంకటేశ్వరరావు పాఠశాలలకు పంపించారు.

ఓటర్ల తుదిజాబితా సమగ్రంగా రూపొందించాలి

- పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు ఏర్పాటు చేయాలి
- జిల్లా రోల్ అబ్జర్వర్ శ్రీధర్



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న జిల్లా రోల్ అబ్జర్వర్ శ్రీధర్

మంగళగిరి: ఓటర్ల తుది జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా సమగ్రంగా రూపొందించాలని సీనియర్ ఐఏఎస్ అధికారి జిల్లా రోల్ అబ్జర్వర్ శ్రీధర్ తెలిపారు. నగరంలోని పలు పోలింగ్ బూత్‌లను బుధవారం పరిశీలించిన అబ్జర్వర్ అధికారులు, బీఎల్‌వోలు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ ఓటర్ల జాబితాలను పరిశీలించారు. చేర్పులు-మార్పులు, నూతన ఓటర్ల జాబితాలను పరిశీలించి తుది జాబితా రూపుదిద్దుకుంటున్న నేపథ్యంలో జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా జాబితాలు రూపొందించాలన్నారు. ఎన్నికల అధికారులు ప్రతిరోజు పోలింగ్ కేంద్రాలలో పర్యవేక్షిస్తూ బీఎల్‌ఓలకు తగు సూచనలు చేయాలన్నారు. ఓటు హక్కు ప్రతి ఓటరు వినియోగించుకునేలా అవగాహన కలగచేయడంతో ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వసతులు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ బూత్‌ల వివరాలపై ఓటర్లకు అవగాహన కల్పించడంతో పాటు ఏ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకోవాలి, పోలింగ్ కేంద్రం వివరాలు అన్ని ఓటర్లకు తెలియజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చే ఓటర్లు ఎలాంటి సందేహాలు లేకుండా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలన్నారు. దివ్యాంగులు, వృద్ధులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీకర్, ఈఆర్ఓ లక్ష్మీకుమారి, ఏఈఆర్‌వో కె.హేమామాలిని తదితరులు పాల్గొన్నారు.

నిర్దిష్టమైన పత్రాలు తీసుకోండి

గుంటూరు వెస్ట్: అర్హతలేని ఓట్లను తొలగించడంతో పాటు ఓటు హక్కు నమోదుకు కావల్సిన అన్ని పత్రాలు క్షుణ్ణంగా పరిశీలించి తీసుకోవాలని జిల్లా రోల్ అబ్జర్వర్ బి.శ్రీధర్ తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, డీఆర్వో చంద్రశేఖరరావు, అధికారులతో కలసి నిర్వహించారు. శ్రీధర్ మాట్లాడుతూ 20 ఏళ్ల యువకులు ఓటు హక్కుకు నమోదు చేసుకుంటే అంతకు ముందు ఎందుకు నమోదు చేసుకోలేదో వివరాలు తీసుకోవాలన్నారు. యువత నుంచి ఆధార్‌తోపాటు విద్యార్హత సర్టిఫికేట్లు తీసుకోవాలని చెప్పారు. పోలింగ్ బూత్ పరిధిలో నాలుగు శాతానికి మించి ఓటరు చేరికలు ఉన్నా, 2 శాతానికి మించి ఓట్లు తొలగింపు ఉన్నా ఈఆర్వోలు, ఏఈఆర్వోలు సంబంధిత పోలింగ్ బూత్‌లోని దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలన్నారు. అనంతరం నగరంలో, జిల్లాలో పలు ప్రాంతాల్లో ఓటరు నమోదు ప్రక్రియను, ఓటరు లిస్టులను పరిశీలించారు.

స్టార్ రేటింగ్ గృహోపకరణాలతో ఇంధన పొదుపు

నరసరావుపేట: ప్రజలందరూ స్టార్ రేటింగ్ కలిగిన గృహోపకరణాలు వాడుతూ ఇంధన పొదుపు పాటించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ కోరారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఆర్డీఓ కార్యాలయం నుంచి మల్లమ్మ సెంటర్ వరకు ఇంధన పొదుపుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పచ్చజెండా ఊపి ర్యాలీని జేసీ ప్రారంభించారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు ప్రతి ఏడాది డిసెంబరు 14 నుంచి 20 వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈ వి.శ్రీనివాసరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.ఏడుకొండలు, కో-ఆర్డినేటర్ ఆర్.బంగారయ్య పాల్గొన్నారు.

ముక్కోటికి సిద్ధమైన నారసింహుడు



మంగళగిరిలో విద్యుత్ కాంతులతో వెలుగొందుతున్న స్వామి వారి ఉత్తర ద్వారం



బంగారు దక్షిణావృత శంఖు



తెనాలిలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన కుంభం సాయిబాబు, పాలకమండలి సభ్యులు

- విద్యుత్ కాంతులతో శోభయమానంగా వెలుగొందుతున్న ఆలయం
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు

మంగళగిరి: పట్టణంలో వేంచేసి వున్న శ్రీ లక్ష్మీ నృసింహస్వామి వారు ముక్కోటి ఉత్సవ వేడుకలు సిద్ధమయ్యారు. దేవాలయ ఉత్తర ద్వారంతో గాలిగోపురం, ఆలయ ఆవరణలు విద్యుత్ కాంతులతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఈ నెల 23వ తేదీన శనివారం తెల్లవారుజామున మూడు గంటల నుంచి స్వామి వారు ఉత్తరద్వార దర్శనం ఇవ్వనున్నారు. ముక్కోటి ఏకాదశి రోజు తెల్లవారు జామున మూడు గంటలకు స్వామి వారు ఉత్తర ద్వారంలో బంగారు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. ప్రతి ఏడాది ముక్కోటి ఏకాదశి రోజు భక్తులకు బంగారు శంఖు తీర్థాన్ని అందజేస్తున్నారు. ముక్కోటి ఏకాదశిలో మంగళగిరి నృసింహస్వామి వారి ఆలయంలో అత్యంత పవిత్రంగా భక్తులు శంఖు తీర్థాన్ని స్వీకరిస్తారు. అత్యధికంగా భక్తులు శంఖు తీర్థం స్వీకరణకే ప్రాధాన్యనిస్తారు.

ఆలయ ఈవో ఎ.రామకోటిరెడ్డి మాట్లాడుతూ ముక్కోటికి తరలిరానున్న భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యతనిచ్చి స్వామి వారి దర్శనంతో పాటు శంఖు తీర్థం ప్రతి భక్తుడికి ఎలాంటి ఇబ్బంది లేకుండా పంపిణీ చేసేలా ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. రెండు రోజుల పాటు శంకు తీర్థాన్ని భక్తులకు అందజేస్తామని భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థం స్వీకరించి స్వామి వారి ఆశీస్సులు పొందాలని కోరారు.

23న వైకుంఠపురంలో ఉత్తరద్వార దర్శనం

తెనాలి: పట్టణ వైకుంఠపురంలోని లక్ష్మీపద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 23వ తేదీ ముక్కోటి ఏకాదశి (వైకుంఠ ఏకాదశి)కి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కుంభం సాయిబాబు, సహాయ కమిషనర్/కార్యనిర్వహణాధికారి ఎం.తిమ్మనాయుడు తెలియజేశారు. ముక్కోటి ఏకాదశి పర్వదిన వాల్‌పోస్టర్‌ను బుధవారం ఆలయంలో పాలకమండలి సమక్షంలో వారు ఆవిష్కరించారు. ఆరోజు తెల్లవారుజామున 4.30 గంటల నుంచి స్వామి అమ్మవార్లు వైకుంఠ ద్వారంలో భక్తులకు దర్శనమిస్తారని సాయిబాబు చెప్పారు.

డీఆర్‌ఎం కార్యాలయానికి సిల్వర్ అవార్డు



ఏపీ ట్రాన్స్‌కో ఎం.డి చక్రధర్‌బాబు నుంచి అవార్డులు తీసుకుంటున్న రైల్వే అధికారులు

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): 2023 సంవత్సరానికి రైల్వే కార్యాలయ భవనాలు విభాగంలో ఎనర్జీ కన్జర్వేషన్, ఎనర్జీ ఎఫిషియెన్సీలో విజయాలకు గాను రాష్ట్ర ప్రభుత్వం గుంటూరు రైల్వే డివిజన్ భవన్‌కు సిల్వర్ అవార్డును అందజేయడం చాలా సంతోషదాయకంగా ఉందని డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ అన్నారు. విజయవాడలోని ఓ ప్రైవేటు హోటల్‌లో బుధవారం నిర్వహించిన ఎ.పి ట్రాన్స్‌కో వారి ఆధ్వర్యంలో నిర్వహించిన అభినందన సభలో డీఆర్‌ఎం రామకృష్ణ, సీనియర్ డీఈఈ దినేష్ రెడ్డిలకు అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎనర్జీ ఎఫిషియెన్సీలో సాధించిన విజయాలకు గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం అందజేయడం జరిగిందన్నారు. డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు డివిజన్ సంబంధిత అధికారులు చేస్తున్న సేవలకు ప్రభుత్వం గుర్తించడం జరిగిందన్నారు. ఇదే తరహాలో గుంటూరు రైల్వే డివిజన్‌ను మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు డివిజన్ ఆయా విభాగాధిపతులు తమవంతు సహాయ సహకారాలు అందజేయాల్సిందిగా తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బరి తెగించి.. పేదోడి గూడు కూల్చి..!



టీడీపీ నేత కూల్చివేసిన గుడిసెను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొల్లా



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బొల్లా

వినుకొండ(నూజెండ్ల): టీడీపీకి చెందిన ఒక నాయకుడు బీసీ సామాజిక వర్గానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త ఇంటిని కూల్చేశాడు. అక్రమంగా తన పొలంలో నివాసం ఉంటున్నాడని, ఆ స్థలం తనదేనంటూ విచక్షణరహితంగా పూరిపాకను ధ్వంసం చేయడమే కాకుండా ఇంట్లోని సామగ్రి బయటకు విసిరిపడేశాడు. పల్నాడు జిల్లా వినుకొండ రూరల్ మండలం కొత్తపాలెం గ్రామంలో బుధవారం ఈ ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... వైఎస్సార్ సీపీ కార్యకర్తలు చల్లా బొర్రయ్య, వెంకటయ్యలు వడ్డెర కాలనీలో చిన్న పూరిపాకలు వేసుకుని నివాసం ఉంటున్నారు. అయితే అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు రాయన వెంకటేశ్వర్లు తన భూమిలో గుడిసె వేసుకుని ఉన్నారంటూ చల్లా బొర్రయ్య ఇంటిని నేలమట్టం చేశాడు. పక్కనే మరో ఇంట్లో ఉన్న వెంకటయ్య కుటుంబ సభ్యులను నానా దుర్భాషలాడి బెదిరించాడు. ప్రభుత్వం ఇచ్చిన భూమిలోనే తాము నివాసం ఉంటున్నామని బాధితులు ఎంత చెప్పినా వెంకటేశ్వర్లు వినిపించుకోకుండా ఇంట్లోని సామగ్రిని బయట పడేశాడు. వెంకటేశ్వర్లు తమపై దౌర్జన్యం చేస్తున్నాడంటూ గతంలోనే బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు, రెవెన్యూ అధికారులు సర్వే చేసి వారు నివాసం ఉంటున్న స్థలాలు 1986లో ప్రభుత్వం కొనుగోలు చేసి ఇచ్చినవని, ఈ భూమితో వెంకటేశ్వర్లుకు ఎలాంటి సంబంధం లేదని తేల్చారు. దీంతో తనపైనే ఫిర్యాదు చేస్తారా అని రెచ్చిపోయిన వెంకటేశ్వర్లు బీసీ సామాజిక వర్గానికి చెందిన వారి కుటుంబాలపై దాడి చేసి ఇంటిని కూల్చివేయించాడు. బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పరామర్శించారు. ఆయన వెంట రూరల్ సీఐ సుధాకర్, డిప్యూటీ తహసీల్దార్ అబ్బూరి వెంకటేశ్వర్లు తోపాటు రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

నిమ్మకాయల ధరలు



తెనాలి టౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌లో బుధవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ. 2 వేలు, గరిష్ట ధర రూ.2,500, మోడల్ ధర రూ. 2,400 వరకు పలికింది.

తీరప్రాంత అభివృద్ధిలో సీఎం వైఎస్ జగన్ ముద్ర



మొగ ఇరువైపులా బౌల్డర్స్ ఏర్పాటు

రేపల్లె: తీరప్రాంత అభివృద్ధిలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తనదైన ముద్రవేశారు. ఎన్నో ఏళ్ల నుంచి కలగా మిగిలిపోయిన నిజాంపట్నం హార్బర్ అభివృద్ధిపై ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టిన వెంటనే దృష్టి సారించారు. రూ.451 కోట్లు కేటాయించి, పనులు ప్రారంభించారు. హార్బర్ రెండవ దశలో ప్రధానంగా మోటరైజ్డ్ బోట్లు-1000, 15 మీటర్ల మెకనైజ్డ్ బోట్లు-500, 24 మీటర్ల టూనా లాంగ్ లైనర్స్-100 ఇలా ఒకేసారి వివిధ రకాల బోట్లు 1,600 వరకు నిలుపుకునేందుకు 500 మీటర్ల జెట్టీ నిర్మాణం చేపడుతున్నారు. మొగకు ఇరువైపులా 1,570 మీటర్ల బౌల్డర్స్ ఏర్పాటుతో ఆధునీకరణ, ఆఫీసు భవనం, రెస్ట్ రూమ్, ఐస్ ప్లాంట్, ఓవర్ హెడ్ ట్యాంక్, సాలిడ్ వేస్ట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, పార్కింగ్ ప్లేస్, ఆక్షన్ హాల్, బోటు బిల్డింగ్ యార్డ్, నెట్ రిపేర్ షెడ్, బీఎల్‌సీ పార్కింగ్, సోలార్ ప్యానల్స్‌తో పాటు అధునాతన సౌకర్యాలతో నిర్మాణ చేపడుతున్నారు. ఎస్ఆర్‌కేఆర్ కన్‌స్ట్రక్షన్స్ పనులను వేగవంతంగా నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం అత్యంత కీలకమైన మొగ సామర్థ్యం పెంపుదల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఉత్తరం, దక్షిణం వైపు బౌల్డర్స్ పనులు పూర్తిస్థాయిలో పూర్తయ్యాయి. ప్రస్తుతం బోట్లు రాకపోకలకు ఎటువంటి ఆటంకం కలగకుండా బ్రేక్ వాటర్ సిస్టం నిర్వహిస్తున్నారు. నిజాంపట్నంలో 1980లో 60 బోట్లు నిలుపుదల చేసే విధంగా 250 మీటర్లతో జెట్టీని నిర్మించారు. నాటి నుంచి హార్బర్ దినదినాభివృద్ధి చెందుతూ బోట్ల సంఖ్య గణనీయంగా పెరగటంతో జెట్టీ సమస్య తీవ్రంగా మారింది. దీంతో పాటు సముద్రంలోకి బోట్ల రాకపోకలకు ఏర్పాటు చేసిన మొగ సామర్థ్యం ప్రస్తుత నూతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించే బోట్లకు తీవ్ర విఘాతంగా మారింది. ఒక్కో సమయంలో మొగ వద్ద బోట్ల కింది భాగం తగిలి విరిగిపోవటం జరుగుతున్న పరిస్థితుల్లో మత్స్యకారులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చేది. విపత్తుల సమయంలో జెట్టీలో బోట్లు నిలుపుకునే జాగా లేక కాలువ ఒడ్డున నిలుపుకోవటం వల్ల తుపానుల సమయంలో బోట్లు దెబ్బతినటం, ఈదురు గాలులకు సముద్రంలోకి కొట్టుపోవటం వంటి ఘటనలతో మత్స్యకారులు తీవ్రంగా నష్టపోవటం పరిపాటిగా మారింది.